సాక్షి ప్రకాశం

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



బీసీ సాధికారతకు సీఎం కృషి

బీసీల సాధికారతకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండలో యాదవులతో సమావేశం నిర్వహించారు. - 8లో..



సంక్షేమ పథకాలు 'గుర్తు'ంచుకోండి

సీఎం జగన్ ఐదేళ్ల నుంచి అందించిన సంక్షేమ పథకాలు గుర్తుపెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని మంత్రి మేరుగు నాగార్జున కోరారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37.6/26.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంది.

రంజాన్ వేళలు

మంగళవారం - ఇఫ్తార్: సా॥ 6.28
బుధవారం - సహరీ: ఉ॥ 4.43



న్యూస్‌రీల్

'మేమంతా సిద్ధం' సభా ప్రాంగణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చెవిరెడ్డి

కొనకనమిట్ల: 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఈ నెల 7న ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలోని కొనకనమిట్ల మండలం దొనకొండ అడ్డరోడ్డు వద్ద నిర్వహించే కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా సోమవారం భూమి పూజ చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అన్నా రాంబాబు దేవుని చిత్ర పటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7న లక్షలాది మందితో 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర జరుగుతుందన్నారు. సభకు సీఎం జగన్ తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తారన్నారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భూమి పూజలో ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ పెదవెంకటరెడ్డి, మండల పార్టీ సమన్వయకర్త గురవారెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మందలపు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



మూడుచక్రాల సైకిల్‌పై ఉన్న ఈ దివ్యాంగుడి పేరు షేక్ పాచ్చా. పొదిలికి చెందిన ఇతను టీడీపీ ప్రభుత్వంలో పింఛను కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వికలాంగ పింఛన్ మంజూరైంది. ఠంఛనుగా ప్రతినెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఇప్పుడు టీడీపీ నాయకుల కుట్రలతో వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడటంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ''ఎండలో సచివాలయాలకు వెళ్లి క్యూలో ఉండి అధికారుల కోసం పడిగాపులు కాసి పింఛను తీసుకోవాల్సిన దుస్థితి కల్పించారు.. మా పింఛన్లు ఇంటికి వచ్చి ఇవ్వకుండా అడ్డుకున్న వారు బాగుపడరు. మాలాంటి వృద్ధులు, వికలాంగుల ఉసురు తప్పక తగులుతుంది'' అంటూ మండిపడ్డాడు.



ఒంగోలులో మంచంలో ఉన్న వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ (ఫైల్)



ఈ వృద్ధురాలి పేరు అల్లు తిరుపతమ్మ. వయస్సు 80 సంవత్సరాలు. తర్లుపాడు మండలం జగన్నాథపురానికి చెందిన ఈమెకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. కాస్త దూరం కూడా నడవలేని స్థితిలో ఉన్న ఈమెకు వలంటీరే ఇంటికి వచ్చి ప్రతినెలా పింఛన్ అందించేవారు. చంద్రబాబు కుతంత్రంతో ఇప్పుడు వలంటీర్లు పింఛను ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో సుమారు 3 కిలోమీటర్లు నడిచి వెళ్లి సచివాలయం దగ్గర పింఛన్ తీసుకోవాల్సి వస్తోంది. ''1వ తేదీ అయినా వలంటీరు రాకపోవడంతో వాకబుచేస్తే వలంటీర్లు పింఛన్ ఇవ్వకూడదంటూ టీడీపీ నేతలు కేసులు వేశారని.. అందుకే వారు రాలేదని తెలిసింది. ఎండలు మండిపోతున్నాయి. సచివాలయం దాకా నడిచి వెళ్లి పింఛను తీసుకోలేను. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. మంచి చేసే వాళ్ల మీద కేసులు పెట్టడం ఏందయ్యా..'' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

మా ఉసురు తగులుద్ది..

- పచ్చమంద కుట్రలపై పండుటాకుల ఆగ్రహం
- ఎన్నికల కోడ్ పేరుతో వలంటీర్లపై ఆంక్షలా
- ఒకటో తేదీ ఇంటి వద్దే వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు
- ఆస్పత్రులకు, పొలాలకు వెళ్లి అందించిన వైనం
- మాపైనా వారి రాజకీయాలు
- జిల్లాలో 2 లక్షల 95 వేల మందిపై ప్రభావం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒకటో తేదీ వచ్చిందంటే అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు చిందేవి. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇలా అందరి ఇళ్ల ముందు సూర్యోదయానికి ముందే వలంటీర్లు ఇళ్ల ముందుకు వచ్చేవాళ్లు. ఏమవ్వా బాగున్నావా... ఏం తాతా ఎలా ఉన్నావంటూ కుశల సమాచారాలు అడిగి ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ డబ్బులు వారి చేతుల్లో పెట్టేవారు. అవి అందుకున్న వాళ్ల కళ్లల్లో మెరుపులు చూసి వలంటీరు సంతృప్తి పడేవారు. ఎండైనా, వానైనా లెక్కచేయకుండా అవ్వా తాతలకు పింఛన్లు అందజేసేవారు. ఒక వేళ ఏదైనా పనిమీద వేరే ఊర్లకు వెళ్లి ఉన్నా, ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా అక్కడికి వెళ్లి అందజేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలా అభాగ్యులకు అండగా ఉండే వలంటీరుపై పచ్చదండు కక్ష గట్టింది. రోజుకో రకమైన కథనాలు పచ్చ మీడియా వండివార్చేది. అయినా రెట్టించిన ఉత్సాహంతో వలంటీర్లు ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేలా శ్రమిస్తూ వస్తున్నారు. కరోనా లాంటి కష్ట కాలంలో తెలుగుదేశం పార్టీ అధినేత దగ్గర నుంచి నాయకులు ఇళ్లకు పరిమితమైతే తన ప్రాణాలకు లెక్కచేయకుండా వలంటీరు సాయం అందించాడు. ఎన్నో మంచి పనులు చేసిన వారి సేవలు ఎల్లో మీడియాకు పట్టలేదు. ఎన్నికల పేరు చెప్పి వారిని అభాసుపాలు చేసేలా రోజుకో రకంగా అసత్య కథనాలు వండివార్చింది. కోర్టులకు ఎక్కింది. తాజాగా ఎన్నికల పేరు చెప్పి కొత్త కుట్రలకు తెరతీసింది. తన అనుకూలుర ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు మీద ఫిర్యాదులు చేయించింది. ఎన్నికల సంఘాన్ని సైతం తప్పుదోవ పట్టించింది. ఫలితంగా వలంటీరు ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వరాదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. దీనికి కారణమైన పచ్చదండుపై అవ్వాతాతలు, అభాగ్యులు మండిపడుతున్నారు. ప్రజల నుంచి సైతం పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేము ఏమన్యాయం చేశామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో ప్రభుత్వం, అధికార పార్టీపై ఆ అపవాదు తోసే ప్రయత్నం చేస్తోంది. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పత్రికా ప్రకటన. చేసిన తప్పును ఇలా కప్పిపుచ్చుకునేలా ప్రకటనలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో 2 లక్షల 95 వేల మందిపై ప్రభావం

తెలుగుదేశం పార్టీ దుష్ట కూటమి కుట్రలతో జిల్లాలో 2 లక్షల 95 వేల మంది పింఛన్‌దారులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. వీరందరికీ ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చి తలుపుతట్టి మరీ పెన్షన్లు ఇచ్చేవారు వలంటీర్లు. ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగికి జీతం వచ్చినట్లు క్రమం తప్పకుండా పెన్షన్ వచ్చేది. ఇందుకోసం నెలకు రూ.88.21 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తెలుగుదేశం చేసిన కుట్రల వలన ఈ నెల చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి వచ్చింది. సహజంగానే వృద్ధాప్యంలో ఉన్న అనేక మంది ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. ఇందులో ఎంతో మంది ప్రతినెలా వచ్చే పెన్షన్ డబ్బులు చేతికి అందగానే వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతుంటారు. అవసరమైన ఔషధాలను కొనుక్కుంటూ ఉంటారు. ఇప్పుడు ప్రతినెలా వచ్చే పెన్షన్ ఎప్పుడు వస్తుందో తెలియక కొందరు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. పెన్షన్లు రాకుండా అడ్డుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులపై మండిపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు గట్టి గుణపాఠం చెబుతామంటున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు పోయే కాలం దాపురించిందని విమర్శిస్తున్నారు.

చంద్రబాబు పాలనలో నరకయాతన

చంద్రబాబు పాలనలో పెన్షన్లు తీసుకోవాలంటే నరక యాతన లాగా ఉండేది. అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు పెన్షన్ కోసం పెన్షన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా అగచాట్లు పడాల్సి వచ్చేది. ఏ రోజు పెన్షన్ ఇస్తారో తెలియక రోజుల తరబడి ఎంపీడీఓ కార్యాలయం, పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఉండేది. పైగా జన్మభూమి కమిటీలకు లంచాలు ముట్టజెప్పిన వాళ్లకు త్వరగా పెన్షన్లు అందేవి. ఒకరు చనిపోతే గానీ కొత్తవి వచ్చేవి కావు. ఇంతటి దారుణ పరిస్థితులు చవిచూసిన అభాగ్యులు నేడు ఎలాంటి కష్టం లేకుండా ఇంటికే డబ్బులు వస్తుండడంతో ఆనందంగా ఉన్నారు.

రూ.3 వేల వరకు పింఛన్

జననేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ఎంతో మంది అవ్వాతాతలను కలిశారు. స్వయంగా వారి ఇబ్బందులను గమనించిన ఆయన చలించిపోయారు. తాను అధికారంలోకి వచ్చాక రూ.2 వేల వరకూ ఇస్తానని ప్రకటించారు. అప్పటి వరకు కేవలం వేయి రూపాయలు మాత్రమే పెన్షన్ ఇస్తున్న ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు బెంబేలెత్తిపోయారు. ఎన్నికలకు ముందు రూ.2 వేలు ఇవ్వడం మొదలు పెట్టాడు. అది కూడా కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేలు ఉన్న దానిని పెంచుకుంటూ రూ.3 వేలు చేశారు సీఎం జగన్. అర్హులందరికీ కొత్త పింఛన్లు సైతం అందేలా చేశారు.



మంచంలో ఉన్న ఈ వృద్ధురాలి పేరు శగబండి మస్తానమ్మ. కురిచేడుకు చెందిన ఈమెకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. వలంటీరు ఇంటికి వచ్చి ప్రతినెలా పింఛన్ ఇచ్చేవారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ఆపేయడంతో ఆ వృద్ధురాలికి కష్టం వచ్చిపడింది. ఈనెల పింఛన్ అందలేదు. సచివాలయానికి వెళ్లి పింఛను తెచ్చుకోవాలని చెప్పడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లే స్థితిలో లేని ఆమె ఆవేదన వర్ణనాతీతం. ''ఉద్యోగులు లాగే మా ఇళ్లకు వచ్చి పింఛన్లు ఇచ్చేవాళ్లు. ఏ దిక్కూ లేని మాకు జగన్‌బాబే దిక్కయ్యాడు. ఆయన ఇస్తున్న పింఛన్‌కు అడ్డుపడుతున్న వాళ్లు మా ఇళ్లకు వచ్చి పింఛన్ ఇస్తారా.. మంచి చేయడం చేతకాక పోయినా చేసేవాళ్లను చెడగొట్టడం నీచమైన పని'' అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

- మార్కాపురంలోనే నివాసం ఉంటా..
- చంద్రబాబు కుప్పంలో నివాసం ఉంటాడా..
- ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ జంకె



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు రాంబాబు, కేపి నాగార్జునరెడ్డి, జంకె, హనుమారెడ్డి

మార్కాపురం: ''నాకు 36 సంవత్సరాలుగా వైఎస్సార్ కుటుంబంతో అనుబంధం ఉంది. చంద్రగిరి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో చేసిన అభివృద్ధి పనులను చూసి ఒంగోలు పార్లమెంట్‌ను కూడా అభివృద్ధి చేయమని ఎంపీగా పోటీచేయాలని నన్ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపారు'' అని ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మార్కాపురం పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ వైఎస్ కుటుంబంతో అనుబంధం మూడు తరాల నుంచి కొనసాగుతోందన్నారు. తానూ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు చంద్రగిరి నియోజకవర్గంలో పక్క పక్క గ్రామాల్లో పుట్టామనీ, మరి తనను వలస నేతగా అభివర్ణించిన ఆయన చంద్రగిరి నుంచి కుప్పంకు ఎందుకు వెళ్లాడని ప్రశ్నించారు. తాను మార్కాపురం నియోజకవర్గంలోనే నివాసం ఉండి ప్రజల కష్టసుఖాలు, బాధల్లో పాలుపంచుకుంటాననీ, మరి చంద్రబాబు కుప్పంలో నివాసముంటాడా అని ప్రశ్నించారు. తనకు ఎటువంటి వ్యాపారాలు, వ్యాపకాలు ఏవీలేవని ఒంగోలు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమన్నారు. ఇక్కడి ప్రజల అభిమానాన్ని జీవితాంతం మర్చిపోననీ, తాను ఎన్నటికీ ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లనని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రజలను లక్షాధికారులను చేస్తానంటున్నాడనీ, ఇప్పటికే జగనన్న 130 సార్లు బటన్ నొక్కి రూ.2.70 లక్షల కోట్లు ప్రజలకిచ్చారన్నారు. మే 13న రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుపై నొక్కి మరోసారి సీఎంగా జగనన్నను గెలిపిద్దామన్నారు.

హిమ్ స్కామ్‌లో దళితులను మోసం చేసిందెవరు?: జంకె వెంకటరెడ్డి

మార్కాపురంలో హిమ్ స్కామ్‌లో దళితులను మోసం చేసిందెవరో ప్రజలు ఇప్పటికీ మర్చిపోరని, అలాంటి వారు కూడా స్వార్థ రాజకీయాలు చేస్తూ ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడటం మంచిదికాదని ఏపీఐఐసీ చైర్మన్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. వారి హయాంలో ఎన్ని భూకబ్జాలు చేశారో ప్రజలకు తెలుసునని, అందుకే మూడుసార్లు ఆయన్ను తిరస్కరించారని అన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దు: అన్నా రాంబాబు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురానికి వచ్చి ఇచ్చిన అబద్ధపు హామీలు, మాయమాటలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. హైదరాబాద్‌ను, సింగపూర్‌ను అభివృద్ధి చేసింది తానే అంటాడనీ, అమెరికాకు సలహాదారుడిగా ఉన్నానంటాడనీ, ఎన్నికల్లో గెలిపిస్తే ఇంటికి కిలో బంగారం ఇస్తానంటాడనీ ఇలాంటి అబద్ధపు మాటలు నమ్మవద్దని సూచించారు. మన ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు లేవని, రెకమెండేషన్ లేకుండా పథకాలు అందాయన్నారు. వలంటీర్లపై చంద్రబాబుకు పగ, ద్వేషం ఉందని, వారి బృందం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వృద్ధుల పింఛను ఆపివేయించాడని అన్నారు. మార్కాపురంలో టీడీపీ అభ్యర్థి తనను గెలిపించకుంటే తన శవాన్ని చూస్తారంటూ చేసిన ప్రకటన బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు నిదర్శనమన్నారు. సానుభూతితో రాజకీయాలు చేయడం మానుకోవాలని, ప్రజా క్షేత్రంలో పోటీచేసి గెలవాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి కనపడదా: ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కళ్లకు కనిపించడం లేదా అని గిద్దలూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రశ్నించారు. ఓ పక్క మెడికల్ కాలేజీ నిర్మాణం, మరోవైపు జిల్లా వైద్యశాల అభివృద్ధి, చెన్నకేశవస్వామి ఆలయానికి నాలుగు రాజగోపురాల నిర్మాణం, షాదీఖానా నిర్మాణం, వైద్యశాల ఏర్పాటు, బీసీ భవన్, అంబేద్కర్ భవన్ ఇలా ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు అందరికీ కనిపిస్తుంటే టీడీపీ నేతలకు మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో అన్నా కృష్ణచైతన్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైపాలెం పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి, చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పీఎల్‌పీ యాదవ్, డాక్టర్ మగ్బుల్ బాషా, షాదీఖానా కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కౌన్సిలర్లతోపాటు మహిళా నేతలు పోరుమామిళ్ల విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బాల సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మీరావలి, పట్టణ వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు. పట్టణ శివార్ల నుంచి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్వయంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అన్నా రాంబాబులు బుల్లెట్ బండ్లు నడిపారు. అనంతరం వారిని సన్మానించారు.

ఇస్లాంపేటలో టీడీపీకి షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్థానిక ఇస్లాంపేట 4వ డివిజన్‌లో టీడీపీకి బలమైన షాక్ తగిలింది. రాజకీయం తెలిసినప్పటి నుంచి వారు టీడీపీ లేదా జనసేనలో ఉంటున్న వారు కాస్తా నేడు వైఎస్సార్ సీపీ వైపు అడుగులు వేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, సీనియర్ నాయకులు ఖాదర్, సుబ్బారావుల ఆధ్వర్యంలో అంజి, షేక్ గౌస్, జి.గోపి, షేక్ షాదిత్, షేక్ కరిముల్లా, ఎస్.వెంకట్రావు, కన్నా, అక్బర్, రాహుల్ గాంధీ, యశ్వంత్, వారి కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్వయంగా వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ తప్పకుండా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని పార్టీలో కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను బీజేపీ దారుణంగా దెబ్బతీస్తుందని, అటువంటి పార్టీతో పొత్తు ఉన్న పార్టీల్లో కొనసాగడం ఇష్టం లేదన్నారు. ముస్లింల మనోభావాలకు పెద్ద పీటవేస్తున్న వైఎస్సార్ సీపీలో చేరాలని నిర్ణయించుకున్నామని, పార్టీలతో సంబంధం లేకుండా తమ కుటుంబాలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ఆదేశాలను శిరసావహిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కరోనా సమయంలో ఇస్లాంపేటపై ప్రత్యేక దృష్టి పెట్టి బాలినేని తీసుకున్న చర్యలు ప్రశంసనీయం అని, అందుకే వాసన్నను గెలిపించుకుని తమ అభిమానాన్ని చాటుకుంటామన్నారు.

క్లుప్తంగా

గరుడ వాహనంపై వేంకటేశుడు



గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. సోమవారం ప్రధాన తిరునాళ్ల కావడంతో వెలుగొండ క్షేత్రానికి వేలాది మంది భక్తులు పోటెత్తారు. గోవిందనామ స్మరణలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మారుమోగింది. శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతి రెడ్డి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు. పొదిలి సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్సై మాధవరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌కు మాతృ వియోగం



తలతోటి అన్నమ్మ(ఫైల్)

చీమకుర్తి: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాతృమూర్తి తలతోటి అన్నమ్మ(84) వృద్ధాప్య కారణాలతో సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా తూబాడులో మృతి చెందారు. తన మాతృమూర్తి అన్నమ్మ మరణం తనకు తీరనిలోటని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలిగా ఆమె అందించిన సేవలు అమూల్యమని పేర్కొంటూ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు.

ఆర్గానిక్ లిక్విడ్ ట్యాంకర్ బోల్తా

కొమరోలు: ఆర్గానిక్ రీసైడ్ లిక్విడ్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన కొమరోలు మండలంలోని తిమ్మారెడ్డిపల్లె సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గుంటూరు నుంచి కడప వైపుగా వెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడటంతో డ్రైవర్ మధుబాబుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్యాంకర్‌లో లిక్విడ్ ఉండటంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తుందేమోనని స్థానికులు ఆందోళన చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కలిసి పని చేద్దాం.. విజయం సాధిద్దాం



విజయ సూచిక చూపిస్తున్న నాయకులు



చెవిరెడ్డి, అన్నా, కేపీ, జంకెను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి
- వ్యాపారాలు, వ్యసనాలు లేవు.. మీతోనే ఉంటూ, మీలో ఒకడిగా కలిసిపోతా
- ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- పొదిలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని పార్టీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం సమీపంలో వివేకానంద బీఈడీ కాలేజీలో మార్కాపురం సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు చెవిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, 2019 ఎన్నికల కన్నా మెరుగ్గా 2024 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైనాట్ 175 లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. తన రాజకీయ జీవితం రాజారెడ్డితో మొదలై వైఎస్సార్‌తో ప్రయాణిస్తూ వారి కుటుంబంలో ఒకరిగా మెలిగానన్నారు. నేను మీతోనే ఉంటూ, మీలో ఒకరిగా కలిసిపోతూ మీతోనే కలిసి ప్రయాణం చేస్తానన్నాని భరోసా కల్పించారు. నమ్మిన వ్యక్తుల కోసం అవసరమైతే ప్రాణాలర్పించే మనస్తత్వం ఉన్న వ్యక్తినని చెప్పారు. ప్రకాశం జిల్లా ప్రజలపై నమ్మకంతో సీఎం వైఎస్ జగన్ తనను ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా 5096 పనులకు రూ.972 కోట్లతో అభివృద్ధి చేశానని, అదే రీతిలో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను పొదిలిలో నివాసం ఏర్పాటు చేసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై చెరొక ఓటు చేసి అత్యధిక మెజార్టీలో గెలిపించాలని కోరారు.

పాలకులం కాదు.. సేవకులం : అన్నా

అన్నా రాంబాబు మాట్లాడుతూ తాము పాలకులం కాదు సేవకులమన్నారు. సేవ చేసే భాగ్యం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాబోవు 42 రోజుల కష్టం మీదనే మనందరి భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పారు. అందరం సమష్టిగా పని చేసి వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొద్దామన్నారు.

చంద్రబాబు అసమర్థుడు: జంకె

1996 వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి గాలికి వదిలేసిన చంద్రబాబు నాయుడు నేడు అధికారంలోకి వస్తే ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు.14 సంవత్సరాలు సీఎంగా ఉండి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయిన అసమర్థ సీఎం చంద్రబాబునాయుడని విమర్శించాడు. ఆయన పాలనలో కరువును కూడా దేవుడు కరుణించలేదన్నారు. ప్రజాగళం యాత్రలో ఓట్లేయకపోతే చస్తా.. బలవంతంగా ఉరేసుకుంటా అని సానుభూతి కోసం కందుల చేసిన వ్యాఖ్యలను ప్రజలు నమ్మరన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేలమవుతాం కానీ, ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తే ఎమ్మెల్యే ఎప్పటికీ కాలేరని కందులకు చురకలంటించారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న జగన్: కేపీ

పాదయాత్ర సందర్భంగా సీఎం జగన్ పొదిలి మండలానికి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. దర్శి సాగర్ కాలువ నుంచి పొదిలి పెద్ద చెరువుకు నీటి సమస్య తీర్చేందుకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే ఆ పనులు 10 కిలో మీటర్లు సాగాయన్నారు. మరో 8 కిలో మీటర్లు పనులు చేస్తే ఈ ప్రాంత నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, యర్రగొండపాలెం పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ నాయకులు కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, గుజ్జుల రమణారెడ్డి, జీ శ్రీనివాసులు, గుజ్జుల సంజీవరెడ్డి, కే నరసింహారావు, యక్కలిశేషగిరిరావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, డీ శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, కే నరసింహారావు, సాయిరాజేశ్వరరావు, ఫిరోజ్, గూడూరి వినోద్, గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.



తర్లుపాడులో టీడీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

- 30 కుటుంబాలను ఆహ్వానించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తర్లుపాడు: మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సోమవారం వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. తర్లుపాడులో వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం వద్ద టీడీపీ నాయకులకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు సాధం వీరయ్య, మీర్జపేట మాజీ సర్పంచ్ యరగొర్ల శ్రీనివాసులు, రోలుగుంపాడుకు చెందిన టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు సీహెచ్ గురుమూర్తి, చెన్నారెడ్డిపల్లికి చెందిన జిల్లా వాణిజ్య విభాగం మాజీ అధ్యక్షుడు ఎస్వీ సుబ్బారెడ్డి, గానుగపెంటకు చెందిన రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు గూడూరు వెంకటేశ్వర్లు, నాగెళ్లముడుపు గ్రామానికి చెందిన లాయర్ సీహెచ్ తిరుపాలయ్య, తర్లుపాడుకు చెందిన షేక్ బాషా, షేక్ రెహమాన్‌తోపాటు సుమారు 30 కుటుంబాల వారు ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయం కోసం తాము కృషి చేస్తామని పార్టీలో చేరినవారు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి నాగార్జునరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిర, పార్టీ అధ్యక్షుడు మురారి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం 'సక్షం' యాప్

ఒంగోలు సెంట్రల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగ ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా 'సక్షం' యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ సంచాలకులు జి.అర్చన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్లే స్టోర్, ఐ స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దివ్యాంగ ఓటర్లు పోలింగ్ రోజున వీల్‌చైర్ అభ్యర్థన, పోలింగ్ బూత్ వివరాలు, దివ్యాంగుల కింద మార్కింగ్ చేసుకోవడం, పోలింగ్ బూత్ మార్పునకు, పొరపాట్ల సవరణ అభ్యర్థన, ఫిర్యాదు చేసేందుకు యాప్ వినియోగించుకోవచ్చని వివరించారు. బీఎల్ఓ దగ్గర కూడా మార్కింగ్, ఇతర అభ్యర్థనలు చేసుకోవచ్చని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడు. గిద్దలూరు మండలంలోని నరవ గ్రామానికి చెందిన రామకోటేశ్వరరావు(32) కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 28వ తేదీన గడ్డి మందు తాగాడు. బంధువులు గమనించి కర్నూలు వైద్యశాలకు తరలించారు. ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఆ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

బీసీ సాధికారతకు సీఎం జగన్ కృషి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్



మంత్రి సురేష్‌కు గొర్రె పిల్ల, గొంగళిని బహూకరించిన యాదవులు

సింగరాయకొండ(మర్రిపూడి): బీసీల సాధికారతకు కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని గంజివారి కళ్యాణ మండపంలో సోమవారం కొండపి నియోజకవర్గ స్థాయి యాదవ సామాజికవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. బీసీలను రాజ్యాధికారం వైపు నడిపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో 48 మంది బీసీలకు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని, అంతేకాక ఉమ్మడి ప్రకాశంలో కనిగిరి, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గాలను యాదవ సామాజికవర్గానికి కేటాయించారన్నారు. అంతేగాక ఏలూరు, నర్సరావుపేట పార్లమెంట్ స్థానాలను సైతం ఓసీలకు బదులు బీసీల్లో యాదవులకే ఇచ్చారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో యాదవసామాజిక వర్గం ఓట్లు సుమారు 16 వేలకు పైగా ఉన్నాయని, వారంతా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు జట్టు కట్టి జగనన్నపై యుద్ధానికి వస్తున్నాయని, వారు ఎన్ని కుయుక్తులు, కుత్రలు పన్నినా ప్రజల మనసులో నుంచి వైఎస్ జగన్ ముద్రను చెరిపివేయలేరన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల్లోనే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేశానో ప్రజలకు తెలుసని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి గొప్ప దానశీలి అని కొనియాడారు. ఎమ్మెల్యేగా తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ మాట్లాడుతూ యాదవులంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారని పేర్కొన్నారు. మంత్రి సురేష్‌ను గజమాలతో ఘనంగా సత్కరించి గొర్రెపిల్లను బహుమతిగా ఇచ్చారు. జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్, పార్టీ రాష్ట్ర బీసీ విభాగం జోన్-5 ఇన్‌చార్జి బొట్ల రామారావు, పార్టీ కొండపి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాచగర్ల పిచ్చయ్య యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, డాక్టర్ యన్నాబత్తిన కార్తీక్, మసనం వెంకట్రావు, గాలిబుజ్జి, టంగుటూరు ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో మాజీ సైనికులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రానున్న సాధారణ ఎన్నికల్లో మాజీ సైనికులు భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. సోమవారం ప్రకాశం భవనంలో మాజీ సైనికుల సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో కనీసం 1,500 మంది అవసరం ఉందన్నారు. పోలీసు సేవలతోపాటు ఇతర యూనిఫాం సిబ్బందిని కూడా ఎన్నికల విధుల్లో వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందన్నారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో మాజీ సైనికులు ఉన్నందున వారి సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించామన్నారు. ఆ దిశగా మాజీ సైనికులను సన్నద్ధం చేయాలని సంఘాల నాయకులను కోరారు. మే 12, 13వ తేదీల్లో విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని, గౌరవ వేతనం కూడా చెల్లిస్తామని స్పష్టం చేశారు. విధి నిర్వహణకు తీసుకొచ్చేందుకు, స్వస్థలాలకు చేర్చేందుకు ప్రత్యేక వాహన సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్ఓ శ్రీలత, జిల్లా సైనిక సంక్షేమాధికారి రజనీకుమారి, ఇతర అధికారులు, కంభం, రాచర్ల, బేస్తవారిపేట, కొమరోలు, మార్కాపురం, గిద్దలూరు, ఒంగోలు మాజీ సైనికుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధులపై పీఓలు, ఏపీఓలకు సమగ్రమైన శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల అంశాలపై సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా సోమవారం కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్ఓలు, ఏఆర్ఓలకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. వీరి ద్వారా క్షేత్ర స్థాయిలో పోస్టల్ బ్యాలెట్స్, హోమ్ ఓటింగ్ బృందాలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా పీఓలకు, ఏపీఓలకు విధుల నిర్వహణపై ఈ నెల 5, 7 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. జేసీ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు

'గుర్తు'ంచుకోండి



చీమకుర్తి పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున

- సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించండి
- చీమకుర్తిలో ఊపందుకున్న మంత్రి మేరుగు ప్రచారం

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల నుంచి అందించిన సంక్షేమ పథకాలను గుర్తుపెట్టుకొని వచ్చే ఎన్నికల్లో ఓటేయండని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. సోమవారం చీమకుర్తి పట్టణంలోని 16, 17 వార్డుల పరిధిలో స్థానిక కౌన్సిలర్లు ఆముదాలపల్లి ప్రమీల, మేకల సులోచన ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఓటర్లతో మాట్లాడుతూ.. సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి స్థానికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ శ్రేణులతో కలిసి ఫ్యాన్ గుర్తుతో ఉన్న కరపత్రాలను ఇంటింటికి తిరిగి ఓటర్లకు అందిస్తూ ఫ్యాన్ గుర్తును గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, మేకల యల్లయ్య, కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలడుగు సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిబ్బంది కోసం ప్రత్యేక ఏర్పాట్లు

- ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి



ఆధునికీకరించిన రిజర్వ్‌డ్ డ్యూటీ ఆర్ఎస్సై గదిని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేయడానికి ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ పి.వరమేశ్వరరెడ్డి చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ కార్యాలయం ఆవరణలో ఆధునికీకరించిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డ్యూటీ ఆర్ఎస్సై గార్డు రూంలను ఆయన సోమవారం ప్రారంభించారు. అంతకు ముందు ఆయన గార్డ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది అవసరాలకు అనుగుణంగా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలు, ఎస్కార్ట్‌లకు ప్రణాళికాబద్ధంగా డ్యూటీలు కేటాయించేందుకు డ్యూటీ ఆర్ఎస్సై రూం, విరామ సమయంలో తగిన విశ్రాంతి తీసుకోవడానికి ఏఆర్ గార్డ్ రూంలు ఉపయోగపడతాయన్నారు. రానున్న రోజుల్లో సిబ్బంది సంక్షేమం కోసం మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామన్నారు. నూతన భవనాలను ఆధునికీకరించడంలో కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్ రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి, ఆర్ఐలు రమేష్ కృష్ణ, సీతారామి రెడ్డి, ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.

274 మందికి మెమోలు

ఒంగోలు: పదో తరగతి పరీక్షల మూల్యాంకనం సోమవారం స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఉదయం 8.30 గంటల నుంచి ఐడీ కార్డులు ఉన్నవారిని మాత్రమే అనుమతించారు. ఈ సందర్భంగా వారికి సీట్ల కేటాయింపులు, గ్రూపులు చేయడం తదితరాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. తొలుత 990 మందిని అనుమతించాలని భావించారు. అయితే, రెండు రోజుల మూల్యాంకన విధుల్లో పాల్గొంటున్నవారికి ఎన్నికల విధులపై శిక్షణ ఉండటంతో ఈ నెల 8వ తేదీకి ముగించడం కష్టమవుతుందని భావించారు. దీంతో నాలుగు గ్రూపులను పెంచి మొత్తం సంఖ్యను 1060 చేశారు. తొలిరోజు విధులకు 274 మంది హాజరుకావాల్సి ఉండగా వారు గైర్హాజరయ్యారు. దీంతో బయాలజీ, సోషల్ స్టడీస్, హిందీ, గణితం సబ్జెక్టులకు సంబంధించి సిబ్బంది కొరత కనిపించింది. దీంతో మూల్యాంకన పరిశీలకులు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు డీఈఓ డి.సుభద్ర 274 మందికి మెమోలు జారీచేశారు. మంగళవారం ఉదయం మూల్యాంకన క్యాంపు కేంద్రం వద్ద రిపోర్టుచేసి ఎందుకు గైర్హాజరయ్యారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ శివకుమార్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ టి.కిషోర్‌బాబు తదితరులు పర్యవేక్షించారు.